నేడు ప్రజావాణి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సర్కిల్ జీహెచ్ఎంసీ ఉపకమిషనర్ డాక్టర్ రవికుమార్ తెలిపారు. ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సర్కిల్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్కిల్ పరిధిలోని ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఈ ప్రజావాణి కార్యక్రమానికి హాజరై ఫిర్యాదు చేయాలని సూచించారు. జీహెచ్ఎంసీ సర్కిల్ పరిధిలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు. ఈ అవకాశాన్ని సర్కిల్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కులగణనలో పాల్గొనని వారికి మరో అవకాశం



కులగణన కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రం

రాజేంద్రనగర్: కుల గణనలో ఇప్పటి వరకు నమోదు కాని వారి కోసం ప్రభుత్వం ఈనెల 16వ తేదీ నుంచి 28వ తేదీ వరకు మరోసారి సర్వే కొనసాగిస్తున్నట్లు రాజేంద్రనగర్ సర్కిల్ డీసీ డాక్టర్ రవికుమార్ తెలిపారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాల్లో (వార్డు ఆఫీస్) ఆదివారం ఎలాంటి దరఖాస్తులు అందలేదని తెలిపారు. ప్రజాపాలన కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోని వారు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా గురు నానక్ జయంతి



గురు నానక్ జయంతి ఉత్సవాల్లో కార్తీక్‌రెడ్డి, నాయకులు

అత్తాపూర్: అత్తాపూర్‌లోని గురుద్వారాలో ఆదివారం గురు నానక్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ ఉత్సవాలకు బీఆర్ఎస్ యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డితో పాటు అప్పారెడ్డి ముఖేశ్, సన్నీ, మల్లేష్ యాదవ్, రాజు, గురుద్వార్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

చందానగర్: మియాపూర్ డివిజన్ పరిధిలో సోమవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.5.60 కోట్లతో వరద నీటి కాలువ, సీసీ రోడ్ల నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టనున్నామన్నారు. శ్రీల గార్డెన్ కాలనీలోని వంశీ గెలాక్సీ అపార్ట్‌మెంట్ వరకు రూ.18 లక్షలతో సీసీ రోడ్డు, జయప్రకాష్ నారాయణ నగర్ ప్లాటినం స్కూల్ మెయిన్ రోడ్డు వరకు రూ.42 లక్షలతో సీసీ రోడ్డు, గురునాథం చెరువు నుంచి పటేల్ చెరువు వరకు రూ.5 కోట్లతో నూతనంగా వరదనీటి కాలువ నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు.

కనులపండువగా బ్రహ్మోత్సవాలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి భెల్ ఎంఐజీ కాలనీలోని శ్రీ రామాలయంలో బ్రహ్మోత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం విశేష నవగ్రహారాధన, హోమం నిర్వహించారు. ప్రధాన అర్చకులు పెద్దింటి వెంకట భాస్కర సత్యనారాయణ చార్యులు నేతృత్వంలో చేపట్టిన ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

రాయదుర్గం: గౌలిదొడ్డిలో నూతనంగా నిర్మించిన సంజీవినీ ఆంజనేయసహిత వైకుంఠ సీతారామ నారాయణస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఆదివారం అర్చకుల మంత్రోచ్ఛరణలు, భక్తుల జయజధ్వానాల మధ్య ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, నిర్వాహకులు, స్థానికులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారంలో పునర్నిర్మిస్తున్న పోచమ్మ ఆలయ నిర్మాణానికి కొల్లూరుకు చెందిన నర్సింలు రూ.85 వేల విరాళం శనివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామదేవతల ఆలయాల అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. కమిటీ సభ్యులు దాతను ఘనంగా సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువత వెంకటేశం గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు నరసింహారెడ్డి, మంద రమేష్, లింగం, బ్రహ్మేందర్, శ్రీకాంత్ గౌడ్, బ్రహ్మేందర్ గౌడ్, చంద్రారెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానాలు లేక అవస్థలు!

- స్థలం కేటాయించాలని వినతి
- పట్టించుకోని ప్రభుత్వాలు



ఉస్మాన్‌నగర్‌లోని ఖాళీ ప్రదేశంలో క్రికెట్ ఆడుతున్న యువకులు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): మహానగరంగా విస్తరిస్తున్న తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రామచంద్రాపురంలో క్రీడామైదానాలు యువత ఆటలకు దూరమవుతున్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్న వారు శ్మశానాల్లో, ముళ్ల పొదల్లో ఆడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అనేక ఏళ్లుగా స్థానిక క్రీడాకారులు, యువత రామచంద్రాపురం, తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో క్రీడామైదానం కోసం భూమిని కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. పాలకులు మారుతున్నా ప్రభుత్వం మాత్రం క్రీడామైదానం కోసం స్థలం కేటాయించడం లేదు.

ముళ్లపొదల్లో ఆటలు

మున్సిపల్ పరిధిలోని గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందుతున్నాయి. కానీ క్రీడామైదానాలు లేకపోవడంతో స్థానిక యువకులు ముళ్లపొదల్లో ఆడుకుంటున్నారు. ప్రధానంగా ఈ ప్రాంతాల్లో బహుళఅంతస్తుల భవనాలు నిర్మాణం జరుగుతుండడంతో వలస కార్మికులు ఎక్కువగా నివాసం ఉంటున్నారు. వారు కూడా శని, ఆదివారాల్లో రోడ్లపై, ముళ్లపొదల్లో క్రికెట్ ఆడుకుంటున్నారు.

స్థలం కేటాయించండి..

క్రీడామైదానం కోసం స్థలం కేటాయించాలని స్థానిక యువత ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించారు. ఈ ప్రాంతాలకు చెందిన వందలాది ఎకరాల భూములను ప్రభుత్వాలు స్వాధీనం చేసుకున్నాయి. నేడు ప్రభుత్వం క్రీడామైదానాలకు భూమిను కేటాయించకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రైవేట్ క్రీడామైదానాలకు డిమాండ్

క్రీడామైదానాలు లేకపోవడంతో చాలా మంది ఉద్యోగులు ప్రైవేట్ క్రీడామైదానాల్లో డబ్బులు చెల్లించి ఆడుకుంటున్నారు. దీంతో ఈ ప్రాంతంలో అనేక ప్రైవేట్ క్రీడామైదానాలు పుట్టుకొస్తున్నాయి. ప్రభుత్వం క్రీడామైదానాలను అభివృద్ధి చేస్తే అన్ని వర్గాల ప్రజలు క్రీడల్లో రాణించే అవకాశం ఉంది.

క్రీడలకు దూరంగా ఉంటున్నాం



క్రికెట్ అంటే ప్రాణం గతంలో భెల్ పరిసరాల ఖాళీ స్థలాల్లో బాగా ఆడేవాళ్లం. యాజమాన్యం ఆడుకునే స్థలాల్లో మొక్కలు పెట్టడంతో క్రీడాలకు దూరంగా ఉంటున్నాం. బయట కూడా క్రీడామైదానాలు లేకపోవడంతో క్రీడలపై ఆసక్తి తగ్గింది.

– అల్తాఫ్, విద్యుత్‌నగర్ కాలనీ

మైదానాలను అభివృద్ధి చేయాలి



ప్రభుత్వం అన్ని ప్రాంతాల్లో క్రీడామైదానాలకు భూములను కేటాయించి.. అందులో అన్ని రకాల క్రీడామైదానాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది. లేనిపక్షంలో రానున్న రోజుల్లో యువత క్రీడలకు దూరమయ్యే అవకాశం ఉంది.

– శేఖర్, రామచంద్రాపురం

పదేళ్ల ఆడబిడ్డను రోడ్డుపై వదిలేసిన తల్లి.!

అనాథ బాలికల ఆశ్రమానికి తలిలిస్తాం: పోలీసులు

అత్తాపూర్: రోడ్డుపై ఒంటరిగా ఉన్న పదేళ్ల బాలికను అత్తాపూర్ పోలీసులు ఆదివారం చేరదీశారు. బాలిక వివరాలను అడగగా పేరు అంజలి అని... బాలికకు అనిల్ అనే వ్యక్తి అన్న ఉన్నట్లు తెలిపింది. తనను తన అమ్మ వదిలి వెళ్లిపోయిందని ఆమె కోసం ఎదురు చూస్తున్నానని పేర్కొంది. రెండు రోజులుగా హసన్‌నగర్‌లోని హోటల్ సమీపంలో వదిలి వెళ్లి ఇప్పటికీ రాలేదని బాలిక ఏడుస్తూ పోలీసులకు వివరించింది. తల్లి పేరు, ఇంటి వివరాలను చెప్పలేకపోతోందని ఓ వ్యక్తి అంజలిని అత్తాపూర్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు బాలికను అనాథ బాలికల ఆశ్రమానికి తరలిస్తామన్నారు.

కంటి ఉచిత వైద్య శిబిరానికి స్పందన



కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న స్థానికులు

రాజేంద్రనగర్: హసన్‌నగర్ మహమూద్‌నగర్ మసీదు–ఏ–హలీమా సుల్తానాలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో స్థానిక ప్రాంతాలకు చెందిన ప్రజలు పాల్గొని వైద్య సేవలను పొందారు. ఈ కార్యక్రమంలో మసీదు ఇమామ్ అబ్దుల్ మోహసిన్ ఉమ్రీ కతీబ్, ఎంఐఎం నాయకులు మహ్మద్ జహంగీర్, ఇక్బాల్ ఖాన్, మహ్మద్ సిద్దిఖ్ అహ్మద్, మీర్జా రిజ్వాన్ బేగ్, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరా విషయంలో రాజీ పడేది లేదు



గోల్కొండ: నీటి సరఫరా విషయంలో రాజీ పడేది లేదని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన జలమండలి ఉన్నతాధికారులతో కలిసి షేక్‌పేట్‌లోని జలమండలి వాటర్ ఫిల్టర్‌బెడ్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వాటర్ ఫిల్టర్‌బెడ్స్‌కు ప్రతి నిత్యం వస్తున్న నీరు, సరఫరా వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... వాటర్ ఫిల్టర్‌బెడ్స్ వద్ద ఉన్న అన్ని పంపులు పనిచేసేలా చూడాలను అధికారులను కోరారు. కొత్త పంపులు అవసరమైతే ఉన్నతాధికారులతో మాట్లాడుతానన్నారు. రానున్న రంజాన్ మాసంలో మసీదులకు ఉచిత ట్యాంకర్ల ద్వారా నీటిని క్రమం తప్పకుండా పంపాలని, అవసరమైతే ట్యాంకర్ల సంఖ్యను పెంచాలన్నారు. సాంకేతిక కారణాల వల్ల నీటి సరఫరాలో అవాంతరాలు ఎదురైతే అధికారులు అందుబాటులో ఉండి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట జలమండలి ఆపరేషన్స్ సీజీఎం అమరేందర్ రెడ్డి, జనరల్ మేనేజర్ వినోద్ భార్గవ్, కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు ఆరూన్ పర్వాన్, వజీఉజ్జ్ జమాన్ తదితరులు ఉన్నారు.

'ఆధార్' వైద్య సేవల కోసం కాదు..



ప్రమీలను పరామర్శిస్తున్న న్యాయమూర్తి అబ్దుల్ జావేద్ పాషా

అఫ్జల్‌గంజ్: రోగులకు వైద్య సేవలు అందించేందుకు ఆధార్ కార్డు తప్పనిసరి కాదని అది లేకపోయినా వైద్య సేవలు కొనసాగుతాయని ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఓపీ బ్లాక్‌లోని ఆర్ఎంఓ కార్యాలయంలో ఏర్పాటు ఏసిన విలేకరుల సమావేశంలో ఆర్ఎంఓ 1 జయకృష్ణ, ఆర్ఎంఓలు డాక్టర్ ఎండీ రఫీ, డాక్టర్ సిద్దిఖీ డాక్టర్ జాఫర్ రష్మీలతో కలిసి మాట్లాడారు. నిత్యం దాదాపు 3000 మందికి ఓపీ వైద్య సేవలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఆధార్‌కార్డు నమోదు చేయడం వల్ల రోగులకు భవిష్యత్తులో అందించే వైద్య సేవలు, మందుల పంపిణీ ఇతర సేవలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆధార్ కార్డు లేని కారణంగా ఓ మహిళ రోగిని ఆస్పత్రిలో చేర్చుకునేందుకు నిరాకరించినట్లు ఓ పత్రికలో (సాక్షి కాదు) వచ్చిన కథనాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. నాగర్‌కర్నూల్ జిల్లా, యడ్లపల్లి గ్రామానికి చెందిన ప్రమీల చికిత్స నిమిత్తం ఈ నెల 8న ఉస్మానియాకు రాగా అదే రోజు ఆధార్ కార్డు లేకున్నా ఎమ్మెల్సీ చేసి క్యాజువాలిటీలో రోగ నిర్ధారణ పరీక్షలను, వైద్య చికిత్సలను అందించినట్లు తెలిపారు. ఫాలో ఆఫ్‌కు రావాలని సూచించి పంపామన్నారు. అయితే ఆ రోజు రాకపోగా ఆసుపత్రి బయట ఉండడంతో ఆమె ఆరోగ్యం మరింత క్షీణించిందని, ఆదివారం ఉదయం అఫ్జల్‌గంజ్ పోలీసులు ఆసుపత్రి బయట ఉన్న ఆమెను తీసుకురాగా ఇన్‌పేషంట్‌గా చేర్చుకుని వైద్య సేవలను అందించామన్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. కాగా చిన్నారి అనూషను చైల్డ్ హోమ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రమీలను నాంపల్లి క్రిమినల్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జ్ అబ్దుల్ జావీద్ పాషా పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఉస్మానియాలో రోగి ప్రమీలకు వైద్య సేవలు అందించిన తీరుపై రాష్ట్ర మంత్రి సీతక్క సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి.

గణపతికి బెల్లంతో ప్రత్యేక అలంకారం



రాయదుర్గం: సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయి క్షేత్రంలో ప్రత్యేక పూజలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని వినాయకుడికి ప్రత్యేక అర్చన, అభిషేకాలు నిర్వహించిన అనంతరం స్వామివారిని బెల్లంతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆతర్వాత అన్నపూర్ణాదేవి, కాశీవిశ్వేశ్వరస్వామి, షిర్డీసాయిబాబా, ఆంజనేయస్వామి, సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అష్టోత్తర పూజలను నిర్వహించారు.

నేడు అన్నదానం

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని రామలింగేశ్వర దేవస్థానంలో మహాశివరాత్రి మండల పూజల్లో భాగంగా సోమవారం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో శివస్వాములు, భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు.

మణికొండ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేశాం



మాజీ ప్రజాప్రతినిధులు సన్మానిస్తున్న హుడాకాలనీ నాయకులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీని ఐదేళ్లలో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామని మాజీ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్, వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అభివృద్ధి చేశారని అన్నారు. ఆదివారం 4వ వార్డు హుడాకాలనీ సంక్షేమ సంఘం నాయకులు మాజీ కౌన్సిలర్ వందన నగేష్, మాజీ కోఆప్షన్ సభ్యుడు జె.సిద్ధప్పతో పాటు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో నిధులు లభ్యతను బట్టి పార్కులు, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, కమ్యూనిటీహాల్ తదితర అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. రాబోయే రోజుల్లోనూ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ఎర్రన్న, నాయకులు సి.బీరప్ప, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ మహారాజ్ శోభాయాత్ర రద్దు



కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ సునీల్‌కు వినతి పత్రం అందజేస్తున్న సేవాదళ్ ప్రతినిధులు

జియాగూడ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా కొనసాగుతున్న నేపథ్యంలో ఈ నెల 19న జరగాల్సిన ఛత్రపతి శివాజీ మహారాజ్ శోభాయాత్రను రద్దు చేస్తున్నట్లు ఛత్రపతి శివాజీ మహారాజ్ సేవాదళ్ అధ్యక్షులు జి.శంకర్, ప్రధాన కార్యదర్శి జి.చంద్రకాంత్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ సునీల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.... 144 ఏళ్ల తర్వాత వచ్చిన మహా కుంభమేళకు పెద్ద ఎత్తున భక్తులు వెళుతున్న నేపథ్యంలో ఈ ఏడాది శోభాయాత్రను విరమించుకున్నట్లు తెలిపారు. వచ్చే సంవత్సరం యాధావిధిగా శివాజీ మహారాజ్ శోభాయాత్రను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు అనిల్ కుమార్, ఠాకూర్ విశాల్‌సింగ్, వికాస్, సహకార్యదర్శులు జి.ప్రశాంత్, శివరామకృష్ణ, బీజేపీ నాయకుడు గుర్రం శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

గోల్కొండ: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు తామెప్పుడు సిద్ధంగా ఉంటామని మెహిదీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ బీవీకే మూర్తి అన్నారు. ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు, అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రయాణికులు, వ్యాపారులు, విద్యార్థులు, కాలనీ, బస్తీ సంక్షేమ సంఘాల నాయకుల కోసం ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అవసరమైన వారు 99592 26133 నంబర్‌లో తనను సంప్రదించవచ్చని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన సలహాలు, సూచనలను పరిశీలించి దానికి అనుగుణంగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కుస్తీ పోటీలకు ఆహ్వానం

గోల్కొండ: దివంగత గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ స్ఫూర్తితో యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. దేవర కరుణాకర్ జ్ఞాపకార్థం ఈ ఏడాది శ్రీ ఛత్రపతి శివాజీ కుస్తీపోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం గుడిమల్కాపూర్ తాళ్లగడ్డ కబడ్డి స్టేడియంలో కుస్తీ పోటీల్లో పాల్గొనే మల్లయోధుల దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... తాము నిర్వహిస్తున్న ఈ వార్షిక పోటీలకు మంచి స్పందన వస్తున్నదన్నారు. కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాల నుంచే కాకుండా నగరానికి చెందిన వివిధ అకాడాలు, వ్యాయామ శాలల నుంచి పెద్ద ఎత్తున పహిల్వాన్లు తమ మల్లయోధులను పంపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గోవర్ధన్, అశ్విన్ మోదీ పాల్గొన్నారు.

28వ తేదీ వరకు మలివిడత కులగణన సర్వే

రాయదుర్గం: రాష్ట్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే రెండవ విడత కార్యక్రమం ఈనెల 28వ తేదీ వరకు కొనసాగుతుందని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు తిరుమలగిరి సురేందర్ తెలిపారు. గచ్చిబౌలిలోని టీఎన్‌జీఓకాలనీలో ఆయన కాలనీవాసులతో కలిసి ఆదివారం పర్యటించి కులగణనలో మొదటి విడతలో పాల్గొనని వారిని ఈ సారి పాల్గొని వివరాలు అందించాలని సూచించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో మిగిలిపోయిన వారిని ఈసారి నిర్వహించే కులగణనలో పాల్గొని తమ పూర్తి వివరాలు అందించాలని ఆయన సూచించారు.

డాక్టర్ ఎస్ఎస్.హసన్‌కు నేషనల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అవార్డు

గోల్కొండ: క్రీడా రంగ అభివృద్ధికి డాక్టర్ సయ్యద్ సిద్ధిఖ్ హసన్ చేసిన సేవలు అభినందనీయమని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం గోల్కొండ సమీపంలోని వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ – 2025 కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన అన్వర్ ఉల్ ఉల్మ్ కాలేజీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగానికి చెందిన డాక్టర్ సయ్యద్ సిద్ధిఖ్ హసన్ సేవల గుర్తింపుగా నేషనల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో వర్ద్ పీస్ సొసైటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ ఈజోంగ్ యంగ్ బాంబే ఫిజికల్ కల్చరల్ ఎడ్యుకేషన్ ప్రధాన కార్యదర్శి దీపక్ షెడ్డే, వాసవీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ.రమణ, ప్రొఫెసర్ జె.ప్రభాకర్ రావు, ప్రొఫెసర్ రాజేష్‌కుమార్, ప్రొఫెసర్ ఎల్‌బి.లక్ష్మీకాంత్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ భోజనం నాణ్యతగా ఉండాలి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని గిరిజన బాలుర హాస్టల్‌ను ఆదివారం టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు లక్ష్మీనివాస్‌కు పలు సమస్యలను వివరించారు. తమకు నాణ్యమైన ఆహారం అందించడం లేదని.. నెలల తరబడి అధికారులకు సూచించిన పట్టించుకోవడం లేదని హాస్టల్ విద్యార్థులు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా హాస్టళ్లలో విద్యార్థులు తీవ్ర అస్వస్థకు గురవుతున్నారని.. విద్యార్థులకు తమకు నాణ్యమైన ఆహారం అందించడం లేదని వివరించారన్నారు. హాస్టల్ భోజనం నాణ్యతగా ఉండే విధంగా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హాస్టల్ అధికారులపై విజిలెన్స్ కమిటీ ఏర్పాటు చేసి రాష్ట్రంలో ఉన్న హాస్టళ్లపైన తనిఖీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎస్ఓ నాయకులు రఘు ముదిరాజ్, సుధాకర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో టీఎస్ఎస్ఓ అధ్యక్షుడు లక్ష్మీనివాస్ తదితరులు

సమస్యల పరిష్కారానికి కృషి

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని వైశాలినగర్‌లో వద్ద నిర్మిస్తున్న నాలా విస్తరణ పనులను శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ స్థానిక కాలనీ, నాయకులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చే ప్రతి అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, బాంగారు బాబు, ప్రసాద్ రెడ్డి, విఘ్నేశ్వర్ రెడ్డి, కృష్ణ కుమార్, మూర్తి, కన్నారావు, హరి ప్రసాద్, కిషోర్, వినయ్, కుమార్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

జీఎన్ఐటీఎస్‌లో టెక్‌స్టార్స్ స్టార్టప్ వీకెండ్



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు వివిధ కంపెనీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు

గోల్కొండ: విద్యార్థులతో పాటు వివిధ కంపెనీల ఉద్యోగులు ఒకే చోట చేరి తమ తమ అభిప్రాయాలను మార్చుకోవడం అరుదైన సంఘటన అని షేక్‌పేట్ జి.నారాయణమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్ రెడ్డి అన్నారు. ఆదివారం కళాశాలలో టెక్ స్టార్స్ స్టార్టప్ వీకెండ్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇటువంటి అరుదైన కార్యక్రమానికి తమ కళాశాల వేదికైనందున ఆనందంగా ఉందన్నారు. 13 సంస్థలు పాల్గొన్న ఈ హాకథాన్‌లో తెలంగాణ తో పాటు మొత్తం ఐదు రాష్ట్రాలకు చెందిన 70 మంది పాల్గొన్నారు. వీరిలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులతో పాటు స్టార్టప్ ఐటీ కంపెనీల్లో పనిచేస్తున్న ఉన్నట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు తమ అధ్యాపకులకు సైతం ఒక కొత్త ఉత్సాహాన్ని ఇస్తాయని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ స్టార్టప్ ల్యాండ్‌స్కేప్‌లో ఒక ముఖ్యమైన మైలురాయి అని ఇందులో పాల్గొనేవారి సృజనాత్మక ఆలోచనలకు జీవం పోస్తుందన్నారు. అంతేకాకుండా విలువైన పరిశ్రమలకు ఎన్నో నూతన కోణాలు సూచించడానికి ఇవి దోహదపడుతాయన్నారు. తెలంగాణ ఇన్నోవేషన్ సెల్, సీబీఐటీ, టెక్కి బోర్డ్, ఆగస్ట్ ఫెస్ట్, ఐఐటీ భిలాయి, ఫౌండర్స్ ఫస్ట్ నెట్‌వర్క్, 100 గిగా తదితర సంస్థలు ఈ సదస్సులో పాల్గొన్నాయి. కార్యక్రమంలో టీజీఐసీ సీఈఓ మేరాజ్ ఫహీం, టెక్ స్టార్స్‌కు చెందిన ఇస్మాయిల్, అటల్ ఇన్‌క్యుబేషన్ సెంటర్‌కు చెందిన డాక్టర్ తాటఖ్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.